కాంగ్రెస్ హామీలకు ఆటోడ్రైవర్లు మోసపోవద్దు

వేముల మారయ్య


మాట్లాడుతున్న వేముల మారయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలకు మరోసారి మోసపోవద్దని తెలంగాణ ఆటో మోటార్స్ డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య పిలుపునిచ్చారు. ఉచిత బస్సు పథకంతో ఆటో కార్మికులకు ఉరితాడు వేసిన కాంగ్రెస్ పార్టీని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని కోరారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత బస్సు ప్రయాణం ఆటో కార్మికుల నడ్డి విరిచిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు ఆటో డ్రైవర్ల సంక్షేమం గురించి ఎక్కడా మాట్లాడకపోవడం విచారకరమన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీల అభ్యర్థులను ఓడించి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పోలే నిరంజన్, ప్రధాన కార్యదర్శి ఎస్.రామకృష్ణ, నాయకులు అహ్మద్‌భాయ్, శాతం రమేష్, ఎస్.పాండు, బాలనర్సింహ్మా, శివకుమార్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పెన్షనర్లకు ఆ ప్లాట్లు ఇప్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కనకం కొమిరెల్లి

అసోసియేషన్ అధ్యక్షుడు కొమిరెల్లి, ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వ పెన్షనర్స్ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కనకం కొమిరెల్లి, ప్రధాన కార్యదర్శి తూము అశోక్‌రెడ్డి కోరారు. గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తామని, అయితే గోపన్నపల్లిలోని తమ ఇళ్ల స్థలాలను తిరిగి ఇప్పించాలని వారు కోరారు. జంట నగరాల్లోని హెడ్ ఆఫీసుల్లో పనిచేసే ఉద్యోగులు రిటైర్డ్ అయ్యే నాటికి సొంత ఇళ్లు ఉండాలనే డిమాండ్‌తో 1985 నుంచి చేసిన అనేక పోరాటాల ఫలితంగా 1991లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం గోపన్నపల్లిలో సర్వే నెంబర్ 36,37లలో 427 ఎకరాలను నాలుగు ప్రధాన ఉద్యోగ సంఘాల సభ్యులకు కేటాయించిందన్నారు. 2010లో సభ్యులకు లాటరీ ద్వారా ప్లాట్ల పంపిణీ చేయగా, దీనిపై సీనియర్ ఉద్యోగులు హైకోర్టుకు వెళ్లి స్టే ఆర్డర్ తీసుకువచ్చారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్లాట్లను అందించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సెక్రటరీ సూర్యకళ, ఉపాధ్యక్షులు వేణుగోపాల స్వామి, కోశాధికారి రామనాథం, సహాయ కార్యదర్శి ఝాన్సీ రాణి, లక్ష్మణ్‌రావు, వి.టి.కృష్ణ, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ల అమలుకు కట్టుబడి ఉన్నాం

బీజేపీ ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి


మాట్లాడుతున్న చింతల రాంచంద్రారెడ్డి

కాచిగూడ: రిజర్వేషన్ల అమలుకు బీజేపీ కట్టుబడి ఉందని ఆపార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రాంచంద్రారెడ్డి అన్నారు. దేశంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన రిజర్వేషన్లను తొలగించే శక్తి ఎవరికీ లేదని అన్నారు. కావాలనే ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల్లో లబ్ధి కోసమే బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం మారుస్తారని, రిజర్వేషన్లను తొలగిస్తారని అసత్యప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావుతో కలిసి ఆయన మాట్లాడారు. బీజేపీ కేవలం మతపరమైన రిజర్వేషన్లకు మాత్రమే వ్యతిరేకమని పేర్కొన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంలో, పార్టీలో తగిన గుర్తింపునిచ్చి ప్రోత్సహిస్తోందని తెలిపారు. 60 సంవత్సరాల కాంగ్రెస్ పాలనపై, 10 సంవత్సరాల నరేంద్రమోదీ పాలనపై ప్రజల్లో చర్చ జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. సమావేశంలో బీజేపీ నేతలు శ్యాంసుందర్ గౌడ్, సి.కృష్ణయాదవ్, సుభాష్, రచనారెడ్డి, వేముల అశోక్, అమర్‌నాథ్, ఎడెల్లి అజయ్ కుమార్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దానం గెలిస్తేనే నియోజకవర్గ అభివృద్ధి


జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న ఆ పార్టీ నాయకులు

చిక్కడపల్లి: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కెన్నడీ రాజు ప్రజలను కోరారు. దానంను గెలిపించాలని కోరుతూ గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా కెన్నడీ రాజు మాట్లాడుతూ దాదాపు 8 వేల ఇండ్లలో ఇంటింటి ప్రచారం నిర్వహించామని, ప్రజల నుంచి మంచి స్పందన లభించిందన్నారు. ఆ పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, నగర ఉపాధ్యక్షులు గుర్రం శంకర్, నగర నాయకులు మారిశెట్టి నర్సింగ్‌రావు, గుండు జగదీశ్ బాబు, సురేందర్, డీకే శ్రీనివాస్, నవీన్‌కుమార్, డి.రాజు, నర్సింగ్‌ముదిరాజ్ , మజార్, హఫీజ్, సుబ్బారావు, చంద్రకళ, జయ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి


ప్రచారం చేస్తున్న అంజిరెడ్డి

కవాడిగూడ: కార్మికుల శ్రేయస్సు కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి అన్నారు. గురువారం సికింద్రాబాద్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా ముషీరాబాద్ డివిజన్‌లోని దాయారమార్కెట్, లేబర్ అడ్డా, పఠాన్‌బస్తీలో కరపత్రాలు పంచుతూ నాగేందర్‌ను గెలిపంచాలని కోరారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ బీజేపీ కార్మికుల హక్కులను, చట్టాలను కాలరాస్తూ అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. కనీస వేతనాలను అమలు చేయకుండా కార్మికులను శ్రమదోపిడికి గురిచేస్తున్నదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉన్నా కార్మికులకు ఏనాడూ న్యాయం చేయలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామానందరెడ్డి, రాజు, సురేందర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి: అంజన్



అంజన్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బాబూరావు

చిక్కడపల్లి: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత ఎస్.బాబూరావు గురువారం అంజన్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాబురావుకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీలలో అయిదు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తోందన్నారు. సీఎం రేవంత్ ఆధ్వర్యంలో ప్రజా సంక్షేమానికి పనిచేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, నగర ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్, ప్రధాన కార్యదర్శి గుండు జగదీశ్‌బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావు, శంకర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆ మూడు ఇలా.. జనం మూడ్ ఎలా?

- అంబర్‌పేటలో మెజార్టీ ఓట్ల సాధనకు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కసరత్తు
- గులాబీకి సిట్టింగ్ ఎమ్మెల్యే బలం
- సీఎం ప్రచారం, మైనార్టీలపై కాంగ్రెస్ ఆశలు
- బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి గత వైభవంపై ధీమా







అంబర్‌పేట: సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే అంబర్‌పేట అసెంబ్లీ సెగ్మెంట్‌లో భారీ మెజార్టీ ఓట్లు సాధించడం పైనే ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కన్నేశాయి. ఓటర్లను ఆకట్టుకోవడానికి హేమాహేమీలతో ప్రచారపర్వం సాగిస్తున్నాయి. నియోజకవర్గంలో ఉన్న మొత్తం 2.70 లక్షల మంది ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఇంటింటికీ తిరుగుతూ హామీలు గుప్పిస్తున్నాయి. కార్నర్ మీటింగ్‌లతో హోరెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్, బీజేపీ పోటాపోటీగా దూసుకుపోతున్నాయి. నాయకత్వలేమిలో ఉన్న కాంగ్రెస్ కేవలం అధికార బలంతో ముందుకుపోతోంది. 30 శాతంగా ఉన్న మైనార్టీల ఓట్లు కీలకంగా మారే అవకాశముంది. ఓటర్ల మూడ్ ఈ మూడు పార్టీలపట్ల ఏవిధంగా ఉంటుందో చూడాలి మరి.

మూడు పర్యాయాలుగా బీజేపీ

అంబర్‌పేట బీజేపీకి కంచుకోట. మూడు పర్యాయాలు బీజేపీ లోక్‌సభ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఎమ్మెల్యేగా వ్యవహరించారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్‌కు ముందే అతను అంబర్‌పేటపై ప్రత్యేక దృష్టి సారించి మెజార్టీ ఓట్లు ఇక్కడే సాధించేలా వ్యూహత్మకంగా వ్యవహరించారు. క్షేత్రస్థాయిలో బలమైన క్యాడర్ ఉంది. ఐదు డివిజన్‌లలో ప్రతి పోలింగ్ బూత్‌పై పార్టీ నాయకత్వనికి అవగాహన ఉండటంతో మెజార్టీ ఓట్లు రాబట్టుకోవడం సులువు అని భావిస్తున్నారు.

బీఆర్ఎస్‌కు సిట్టింగ్ బలం

బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గంలో బలమైన శక్తిగా రూపుదిద్దుకుంది. మొదటిసారి బీజేపీ కంచుకోట అయిన అంబర్‌పేటలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గులాబీ జెండాను ఎగిరేలా చేశారు. రెండవసారి సహితం భారీ మెజార్టీతో బీజేపీపై పైచేయి సాధించారు. కాలేరు వెంకటేష్ ఉన్న ఐదు డివిజన్‌లలో బస్తీలు, కాలనీలకు అతీతంగా సొంత ఇమేజ్‌ను పెంచుకున్నారు. దీంతో ప్రతి ప్రాంతానికి వెళ్లి మెజార్టీ ఓట్లు తెచ్చుకొవచ్చానే ధైర్యంతో ఆ పార్టీ క్యాడర్ ముందుకు వెళుతోంది.

కాంగ్రెస్ పార్టీ ఆశ అదే ...

అంబర్‌పేట నియోజకవర్గంలో గత మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీలో ప్రాతినిధ్యం లేదు. నాయకత్వ లేమితో కాంగ్రెస్ క్యాడర్ ఇతర పార్టీల్లోకి వెళ్లారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొద్దిమంది తిరిగి కాంగ్రెస్ గూటికి చేరినప్పటికీ పార్టీ ప్రజల్లోకి ఇంకా వెళ్లలేదు. సీఎం రేవంత్‌రెడ్డిపై ఉన్న క్రేజ్ తో రెండు రోజుల క్రితం నిర్వహించిన కార్నర్ మీటింగ్ విజయవంతం అయినప్పటికీ ఓట్ల రూపంలో ఏ మేరకు ఫలితం ఉంటుందో వేచి చూడాల్సిందే. మైనార్టీలు కాంగ్రెస్ వైపు పూర్తి స్థాయిలో ఉంటే కలిసివచ్చే అవకాశం ఉంది.

బీసీ యువజన సంఘం గ్రేటర్ అధ్యక్షుడిగా ఎడ్ల విశాల్



కాచిగూడ: బీసీ యువజన సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా ఎడ్ల విశాల్ పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎడ్ల విశాల్ పటేల్ మాట్లాడుతూ బీసీల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్యకు, నేతలు అరుణ్ బాబు, గవ్వల భరత్, నీల వెంకటేష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మూసీలో గుర్తుతెలియని మృతదేహం


మూసీనదిలో లభ్యమైన గుర్తుతెలియని మృతదేహం

అంబర్‌పేట: ముసారాంబాగ్ మూసీనది పరీవాహక ప్రాంతంలో గుర్తుతెలియని మృతదేహం లభించింది. ఈ సంఘటన గురువారం అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ భానుప్రకాశ్‌రెడ్డి కథనం ప్రకారం... సుమారు 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి మూసీలో మృతి చెందాడని స్థానికుల నుంచి పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడు రెండు రోజుల క్రితం అందులో పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. అయితే ఆయన ఒంటిపై ఎలాంటి గాయాలు లేవు. అతడు ముదురు నీలిరంగు టీషర్టు, నలుపు షార్ట్ వేసుకొని ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్నీ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సికింద్రాబాద్ బరిలో 'సునామీ పార్టీ'

హిమాయత్‌నగర్: ఆల్ ఇండియా బ్యాక్ వర్డ్ సునామీ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థిగా బరిలో నిలువనున్నట్లు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు సి.హెచ్. భూపాల్ గౌడ్ తెలిపారు. ఎన్నికల సంఘం తనకు ఉంగరం గుర్తును కేటాయించిందని తెలిపారు. గురువారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో పాలకుర్తి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి కూడా బరిలో నిలిచినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు తెలంగాణలో అప్పటి సీఎం కేసీఆర్ తెచ్చిన ధరణి పోర్టల్ వల్ల లంచాలు తీసుకొని 60 లక్షల మంది రైతులకు అన్యాయం చేశారన్నారు. గత 70 ఏళ్లుగా అగ్రవర్ణాలు దేశాన్ని దోచుకున్నాయని మండిపడ్డారు. బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. తనకు సికింద్రాబాద్ ఓటర్లు తమ అమూల్యమైన ఓటును వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు ఓట్లు వేయొద్దని పిలుపునిచ్చారు.

ఓటుహక్కు వినియోగించుకోవాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఆర్‌వో మారుతీ దివాకర్

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గంలో పోలింగ్ శాతం పెంచేందుకు కృషి చేస్తున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మారుతీదివాకర్ తెలిపారు. గురువారం గోల్నాకలో డీఎస్ సేవా సమితి అధ్యక్షుడు నర్సింగ్‌రావు అధ్వర్యంలో నిర్వహించిన ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని దానిని ఓటర్లు అందరూ వినియోగించుకోవాలని కోరారు. ఓటర్లకు పోలింగ్ బూత్‌లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సేవా సమితి ఆధ్వర్యంలో అంబలి పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సతీష్ ముదిరాజ్, కృష్ణ, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు

అంబర్‌పేట: నిరుద్యోగ యువత కోసం పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్(గ్రీన్‌లాండ్స్) సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగాల కోసం ఈ నెల 10వ తేదీ లోపు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు డాక్టర్ లక్ష్మి కుమారి, గురుసేన్, విద్యాభూషణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీన ఉదయం పది గంటలకు దరఖాస్తు చేసుకున్నవారికి ఇంటర్వ్యూలు నిర్వహించి అప్పటికప్పుడు ఉద్యోగ నియామకపత్రం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. డిప్లొమా అర్హతతో ఎస్ఎమ్‌టీ ఆపరేటర్స్, ప్రొడక్షన్ ఆపరేటర్స్ 150 ఉద్యోగా అవకాశాలు ఉన్నాయి. వీరికి వేతనం నెలకు రూ.16 వేలు ఉంటుంది. ఐటీఐ అర్హతతో ఎస్ఎమ్‌టీ ఆపరేటర్స్, ప్రొడక్షన్ ఆపరేటర్స్ 220 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. వీరికి వేతనం నెలకు రూ.15 వేలు ఉంటుంది. 10వ తరగతి, ఇంటర్ అర్హతతో ఎస్ఎమ్‌టీ ఆపరేటర్స్‌కు 180 ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి. వీరికి వేతనం నెలకు రూ.14 వేలు ఉంటుంది. ఈ ఉద్యోగాలకు యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవచ్చు. గరిష్ఠ వయో పరిమితి 33 ఏళ్లు. ఆసక్తి గలవారు ఈ నెల 8వ తేదీలోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు పరావస్తు క్రియేటివ్ ఫౌండేషన్ వెబ్ సైట్, ఫేస్‌బుక్ పేజీలు, ఫోన్: 95424 33427/ 95156 58033 లలో సంప్రదించవచ్చు. ఇంటర్వ్యూలను రాణిగంజ్ బోయగూడలో ఉన్న గుజరాతీ హైస్కూల్‌లో చేపట్టనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతోపాటు ఆధార్ కార్డు, అర్హత సర్టిఫికెట్‌లను వెంట తెచ్చుకోవాలన్నారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీని గెలిపించాలి

ఎంపీ డాక్టర్ లక్ష్మణ్


భోలక్‌పూర్‌లో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

కవాడిగూడ: దేశ భవిష్యత్, దేశ రక్షణ కోసం నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం మరోసారి రావాలని ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మాగనర్, ఇందిరానగర్, బ్యాంక్ ఆఫ్ బరోడా కాలనీ, సంజీవయ్యనగర్‌లో సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ కమలం గుర్తుకే ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ప్రజలు చిత్తుగా ఓడించినా మరోసారి పార్లమెంటు ఎన్నికల్లో నమ్మించేందుకు బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ప్రజలు ప్రధాని నరేంద్రమోదీని మూడవ సారి ప్రధానిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు, మీడియా సెల్ ఇన్‌చార్జి బిజ్జి కనకేష్ కుమార్, నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ రమేష్‌రాం, జాయింట్ కన్వీనర్ మహేష్‌కుమార్, రాష్ట్ర నాయకులు ఆర్.విశ్వం, నందగిరి నర్సింహా, భోలక్పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రవి కుమార్, నాయకులు నిత్యానంద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ మాయలకు మోసపోవద్దు


ప్రచారం చేస్తున్న ముఠా జైసింహా, శ్రీనివాస్‌రావు

కవాడిగూడ: రాజకీయ లబ్ధికోసం బీజేపీ, కాంగ్రెస్ నేతల చెబుతున్న మాయమాటలు నమ్మి మోసపోవద్దని, ఈ రెండు పార్టీలకు ఓటు వేస్తే ఓటు వృథా అవుతుందని బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహా అన్నారు. గురువారం భోలక్‌పూర్ డివిజన్‌లోని గుల్షన్ నగర్, గంగపుత్ర సంఘం, వెంకటేశ్వర కాలనీలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థి టి.పద్మారావు గౌడ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జులు సయ్యద్ అస్లాం, దీన్‌దయాల్‌రెడ్డి, డివిజన్ బీసీ సెల్ అధ్యక్ష, కార్యదర్శులు ఉమాకాంత్, కృష్ణ, మగ్బూల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా బీఆర్ఎస్ వైపే: కాలేరు


గోల్నాకలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు దంపతులు

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గ ప్రజలు పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ వైపే ఉన్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం గోల్నాక డివిజన్‌లో మాజీ కార్పొరేటర్, ఆయన సతీమణి కాలేరు పద్మతో కలిసి ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పద్మారావుగౌడ్ విజయానికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. కారు గుర్తుకు ఓటు వేసి పోలింగ్ బూత్‌ల వారీగా మెజార్టీ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మోదీ పాలనలోనే దేశాభివృద్ధి


ప్రచారం నిర్వహిస్తున్న కన్నె రమేష్ యాదవ్

కాచిగూడ: ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్ అన్నారు. గురువారం కాచిగూడ డివిజన్ 194 పోలింగ్ బూత్ పరిధిలో పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి బీజేపీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు సుభాష్ పటేల్, యశ్వంత్, రూపేష్ సింగ్, సునిల్ యాదవ్, క్రాంతి, చందు, పియూష్, కార్తిక్ పటేల్ పాల్గొన్నారు.

ఇండియా కూటమికి దివ్యాంగుల మద్దతు


సమావేశంలో మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జాతీయ కాంగ్రెస్ పార్టీ (ఏఐసీసీ) రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు మేనిఫెస్టోలో పొందుపరచడంపట్ల డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ హర్షం ప్రకటించింది. ఈ మేరకు సొసైటీ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, నేషనల్ కోకన్వీనర్ కాటమోని వెంకటేష్‌గౌడ్, వి.భారతీ, ఇమ్రాన్‌ఖాన్, సత్యనారాయణ గురువారం బాగ్‌లింగంపల్లిలోని కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇండియా కూటమికి దివ్యాంగులు మద్దతు తెలుపుతున్నట్లు వెల్లడించారు.

కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారం


కట్టెల సుభాష్

కాచిగూడ: బీజేపీ చెబుతున్నట్లు దేశంలో మోదీ హవా లేదని, లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి రెండు వందల సీట్ల లోపే వస్తాయని, కేంద్రంలో అధికారం చేపట్టేది ఇండియా కూటమేనని టీపీసీసీ ఓబీసీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్, మున్నూరుకాపు మహాసభ ప్రత్యేక ఆహ్వానితుడు కట్టెల సుభాష్ ధీమా వ్యక్తం చేశారు. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన మున్నూరుకాపు ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు లోపాయికారిగా సహకారం అందించుకుంటున్నాయని ఆరోపించారు. దానం నాగేందర్‌కు అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందని, భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమన్నారు. కేంద్రమంత్రిగా, ఎంపీగా కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అభివృద్ధిలో విఫలమైన కిషన్‌రెడ్డిని ఆ పార్టీ నేతలే వ్యతిరేకిస్తున్నారని అన్నారు.

కిషన్‌రెడ్డికి మద్దతుగా బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీలో మాజీ కార్పొరేటర్ వనం రమేష్

నల్లకుంట: సికింద్రాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నేతలు గురువారం సాయంత్రం నల్లకుంటలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మాజీ కార్పొరేటర్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు వనం రమేష్‌తో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణ రాయభారం



చిక్కడపల్లి: ది ఇండియన్ నేషనల్ థియేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో గురువారం సాయంత్రం నిర్వహించిన శ్రీ కృష్ణ రాయ భారం పద్యనాటక ప్రదర్శన ఆకట్టుకుంది. కృష్ణుడుగా నాగేందర్, అర్జునుడుగా దొంతి జంగయ్యగౌడ్, దుర్యోధనుడుగా బాలనాగేశ్వర్‌రావు నటించి ధీర్ఘరాగాలాపనతో శ్రోతలను అలరించారు. సాహితీవేత్త డాక్టర్ ఎం.కె. రాము పాల్గొని కళాకారులను సత్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో గౌరీశంకర్, అంజుబాబు, కురగంటి రాధిక, ఆనంద్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం, దామోదర్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


తేజశ్రీ(ఫైల్)

నల్లకుంట: ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఓ యువతి అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాలు... అడిక్‌మెట్‌లోని అనురాధ నదన్‌లోని ఓ ఫ్లాట్‌లో టి.సంపత్ నివాసముంటున్నారు. డిప్లొమా కోర్సుకు సిద్ధమవుతున్న ఆయన కుమార్తె టి.తేజశ్రీ(21) బుధవారం రాత్రి అందరితోపాటు నిద్రించింది. గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు నీళ్లు తాగడానికి సంపత్ లేచి చూసేసరికి గదిలో కుమార్తె కనిపించలేదు. అన్నిచోట్ల విచారించినప్పటికీ కుమార్తె ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన సంపత్ గురువారం కుమార్తె కనిపించడం లేదంటూ నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.